సాక్షి
మెదక్

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023




గుప్పుమంటున్న గంజాయి
వలసజీవుల బలహీనతను అక్రమార్కులు కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని సరఫరా చేసి మత్తుకు బానిస చేస్తున్నారు. 8లో

ముగ్గురికి కరోనా
మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో మూడు కరోనా కేసులు నమోదైనట్టు జిల్లా వైద్యాధికారి చందూ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పరిధిలోనే ముగ్గురు కరోనా బారిన పడ్డారని చెప్పారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవడంతో పాటు తప్పనిసరిగా మాస్కు ధరించాలని సూచించారు.



సీపీఆర్‌పై అవగాహన అవసరం
సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సూచించారు. సోమవారం నర్సాపూర్‌లో మున్సిపల్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. 9లో



సొంతింటి కల నెరవేరేనా?

- అసంపూర్తిగా 'డబుల్' ఇళ్ల నిర్మాణం
- 504 ఇళ్లకు కేవలం 472 మాత్రమే పూర్తి
- అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపణలు



తూప్రాన్‌లో అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్లు



పూర్తికాని సీసీ రోడ్డు నిర్మాణ పనులు

తూప్రాన్: గూడు లేని నిరుపేదల సొంతింటి కల కలగానే మిగులుతోంది. పేదలకు చెందాల్సిన డబుల్ బెడ్రూం ఇళ్లు అనర్హుల పాలవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మనోహరాబాద్, వెల్దుర్తి, చేగుంట మండలాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా కొన్ని చోట్ల నిర్మాణ దశలోనే ఉన్నాయి. పూర్తయిన వాటిలో కొందరికి పట్టాలు పంపిణీ చేసిన అధికారులు.. మిగితా వారికి అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు పంపిణీ చేసిన ఇళ్లలో స్థానిక రాజకీయ నాయకుల సిఫార్సులతో అనర్హులకు అందజేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- తూప్రాన్ పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ప్రజల నుంచి 1,652 దరఖాస్తులు రాగా 1,154 మంది పేదలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.
- వీరికోసం 504 ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 25.20 కోట్ల నిధులు కేటాయించింది. కాగా అధికారులు 472 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు.
- ఇందులో మొదటి విడతలో 311 మందికి మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. రెండో విడతలో 105 మందికి అధికారులు అందజేశారు.
- పంపిణీ చేసిన ఇళ్లలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్, తాగునీరు, తలుపులు, కిటికీలు అసంపూర్తిగానే ఉన్నాయి.

అర్హుల గుర్తింపునకు కసరత్తు

- మిగితా 56 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. మూడో విడత ద్వారా మరో వారం రోజుల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రత్యేక అధికారులు కసరత్తు చేస్తున్నారు.
- కొందరు ఇళ్ల పట్టాలు పొందకుండానే బలవంతంగా డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉంటున్నారు.
- మనోహరాబాద్‌లో 72, కోనాయిపల్లిలో 25, రామాయిపల్లిలో 81 ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యాయి.
- అర్హులను గుర్తించిన అధికారులు ఇప్పటికే పంపిణీ చేశారు. అయినా అవకతవకలు జరిగాయని మనోహరాబాద్ గ్రామస్తులు ఆందోళన కొనసాగిస్తున్నారు.
- వెల్దుర్తి మండల కేంద్రంలో 100, ఉప్పులింగాపూర్‌లో 80 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. కానీ ఇప్పటివరకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదు.
- చేగుంట మండలంలో 108 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కాగా అర్హులకు పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.
- అయితే డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో అధికార పార్టీకి చెందిన నాయకులు పైరవీలు కొనసాగిస్తున్నారు.
- అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ తాము చెప్పిన వారికే తప్పనిసరిగా ఇళ్లు ఇవ్వాలని చెబుతున్నట్టు సమాచారం.

ఎంతో ఆశ పడ్డాం



ఏన్నో ఏళ్లుగా అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాం. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు డబుల్ బెడ్రూం ఇస్తామంటే ఎంతో ఆశ పడ్డాం. ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. కానీ అర్హులకు ఇవ్వడంలేదు. ఇప్పటికైనా అధికారులు తమకు ఇల్లు మంజూరు చేయాలి.
– కవిత, తూప్రాన్

గుడిసెలో ఉంటున్నాం



తాము పుట్టినప్పటి నుంచి ఊరి బయట గుడిసెల్లో నివసిస్తున్నాం. అధికారులు, నాయకులు తమను పట్టించుకోవడం లేదు. ఆస్తులు ఉన్న వారికే ఇల్లు ఇస్తున్నారు. తమను పట్టించుకునేవారే కరువయ్యారు.
– శాంతికొ, తూప్రాన్

అర్హులకే ఇస్తాం



నిజమైన అర్హులకు మాత్రమే పట్టాలు పంపిణీ చేస్తాం. డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ఎలాంటి పైరవీలకు తావులేదు. బలవంతంగా ఎవరైనా ఇళ్లలో నివసిస్తే వారిని వెంటనే ఖాళీ చేయించి అర్హులకు పంపిణీ చేస్తాం. వారం రోజుల్లో మిగిలిన 56 ఇళ్లకు పట్టాలు పంపిణీ చేస్తాం.
– జయరాజు, జిల్లా మైనింగ్ ఏడీ, డబుల్ బెడ్రూం ప్రత్యేకాధికారి

గ్రామీణ భారత్‌లో పెద్ద ప్లాంట్



గోదారమ్మకు పూజలు చేస్తున్న మంత్రులు

- మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు
- డబ్ల్యూటీపీ ట్రయల్ రన్ ప్రారంభం



మోటార్ల స్విచ్‌ను ఆన్ చేస్తున్న మంత్రులు దయాకర్‌రావు, హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): మంగోల్‌లో నిర్మించిన 540 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ గ్రామీణ భారతంలోనే అతిపెద్ద ప్లాంట్ అని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రూ.1,212 కోట్ల చేపట్టిన మల్లన్నసాగర్ గోదావరి జలాలను కుకునూరుపల్లి మండలం తిప్పారం నుంచి మంగోల్‌కు పంపింగ్ చేసే ట్రయల్ రన్‌కు సోమవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎంఓఎస్డీ స్మితా సబర్వాల్‌తో కలిసి స్విచ్ ఆన్ చేశారు. అనంతరం తిప్పారం నుంచి 5.5 కిలో మీటర్ల దూరంలోని మంగోల్ వద్ద పైప్‌లైన్ ద్వారా చేరిన జలాలకు పూజలు చేసి, గోదారమ్మకు సారె సమర్పించారు. ఈసందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ రిజర్వాయర్ ప్రపంచంలోనే మ్యాన్ మేడ్ అన్నారు. కాళేశ్వరం నుంచి 240 కిలోమీటర్లు ప్రయాణించి 550 మీటర్ల ఎత్తులో మల్లన్నసాగర్‌లోకి గోదారమ్మ చేరిందన్నారు. మంత్రి దయాకర్‌రావు మట్లాడుతూ.. ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని, దేశంలోనే నంబర్ వన్‌గా ఈ పథకం నిలిచిందన్నారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ వద్ద నిర్మించిన 540 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఈ ప్లాంట్‌తో ఆరు జిల్లాల్లో 16 మున్సిపాలిటీలు, 1,920 గ్రామాలకు తాగునీరు అందనుంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవం చేసుకునేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ప్రతి రెవెన్యూ డివిజన్‌లోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిక చేసి వందశాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. కౌడిపల్లి, పాపన్నపేట, వెల్దుర్తిలో జనవరి నుంచి నిర్వహిస్తున్న ప్రసవాలను సమీక్షించారు. మాతా శిశు సంరక్షణ సేవలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందని.. గత నెల 78 శాతం ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగాయని తెలిపారు. ఇటీవల జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రేడియాలజీ హబ్ ద్వారా 2డీ ఎకో, ఎక్స్‌రే, ఈసీజీ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని వివరించారు. చెక్ లిస్ట్ ప్రకారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు తమ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే మూసివేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ చందూనాయక్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, గైనకాలజిస్ట్ శివదయాళ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు విజయనిర్మల, అనిల, మాధురి, ప్రోగ్రాం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలి

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెల ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి బక్కారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆల్‌ఇండియా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు హెల్త్‌స్కీం, డీఆర్‌లు అమలు చేయాలన్నారు. పెండింగ్ మెడికల్ బిల్లులు విడుదల చేసి జిల్లావ్యాప్తంగా వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రైల్వేలో వయోవృద్ధులకు రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్‌చంద్రతో పాటు సభ్యులు సారా శ్యాంసుందర్, గోలికుమార్, రత్నం, మధుసూదన్, ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'పది' పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని పదో తరగతి 'ఏ' పరీక్ష కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని వేర్వేరుగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని, పరీక్ష కేంద్ర చుట్టూ జనం ఉండకుండా చూడాలని ఎస్పీ పోలీసులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా ఇదే పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని హెచ్ఎం రాధాకృష్ణను ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ తారాబాయి, ఆర్ఐ శ్రీహరి ఉన్నారు.

పకడ్బందీగా పరీక్షలు



రేగోడ్ పదోతరగతి పరీక్ష కేంద్రం వద్ద డీఈఓ రాధాకిషన్

రేగోడ్(మెదక్)/ పెద్దశంకరంపేట: జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. సోమవారం మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. అనంతరం పెద్ద శంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్లు సుజాత, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎంపీపీ సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే



జెడ్పీ సీఈఓకు హైకోర్టు ఉత్తర్వులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే ఇచ్చిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను టీపీసీసీ డెలిగేట్ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశ్, తదితరులు ఎంపీపీ జ్యోతితో కలిసి సోమవారం జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నర్సాపూర్ ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతిని గత నెల 2వ తేదీన జెడ్పీ సీఈఓ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని.. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. కాగా హైకోర్టు ఉత్తర్వులు జెడ్పీ సీఈఓకు అందజేసి త్వరలో ఎంపీపీగా జ్యోతికి బాధ్యతలు అప్పగించాలని కోరామని పేర్కొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ చందూ నాయక్

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేటలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి చందూ నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటి మందికి కంటి వెలుగు ద్వారా పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు క్యాంపును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్, ఉప సర్పంచ్ సంతోష్, వైస్ ఎంపీపీ రాంచంద్రం, డాక్టర్ అనిల్‌కుమార్, ఏఎన్ఎం అనురాధ, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మద్యానికి బానిసైన తన భర్త అశోక్ నిత్యం అనుమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని చిలప్‌చెడ్ మండలం రాందాస్‌పల్లికి చెందిన ఎరుకల స్వప్న ఫిర్యాదు చేసింది. చట్టప్రకారం తగిన న్యాయం చేయాలని ఎస్ఐకి ఎస్పీ సూచించారు. తమ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద ఏడాది క్రితం రూ. 50 వేలు అప్పుగా తీసుకున్నానని.. కొద్ది రోజులు పనిలేకపోవడంతో వాయిదా ప్రకారం డబ్బులు చెల్లించలేదని తూప్రాన్‌కు చెందిన వెంకటేష్ పేర్కొన్నాడు. అదనంగా వడ్డీ చెల్లించాలని అతడు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. సమస్యను పరిష్కరించాలని తూప్రాన్ డీఎస్పీకి సూచించారు. వీటితో పాటు మరిన్ని ఫిర్యాదులు రాగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నిబంధన పట్టిక.. పక్కన పెట్టి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో దుకాణాదారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వాహకులు నిబంధనలకు పాతరేస్తున్నారు. గతేడాది జూలైలో కొబ్బరికాయలు విక్రయించేందుకు టెండర్ దక్కించుకున్న వ్యక్తి దుకాణ వద్ద ఉంచాల్సిన నిబంధన పట్టికను తీసి పక్కన పెట్టాడు. నిర్వాహకులు నిబంధనలు మీరుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు నిర్వాహకుడు ధరల పట్టికను పక్కన పెట్టడంతో చెప్పిన ధరకే భక్తులు కొబ్బరికాయలను కొనుగోలు చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పూలే జయంతిని జయప్రదం చేయండి

మెదక్ కలెక్టరేట్: నేడు మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక ధ్యాన్‌చంద్ చౌరస్తా, అనంతరం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జయంతి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, ప్రజలు, అధికారులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

13 నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

రామాయంపేట(మెదక్): కోనాపూర్‌లో ఈ నెల 13 నుంచి అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ. 25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 15 వేలు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

బ్లాస్టింగ్‌తో బెంబేలు

పేలుళ్ల ధాటికి కూరుకుపోతున్న బోరు బావులు



కొనసాగుతున్న కాళేశ్వరం కాలువ సొరంగం నిర్మాణ పనులు



మల్కాపూర్‌లో ఎండుతున్న వరి

తూప్రాన్: కాళేశ్వరం కాలువ సొరంగం నిర్మాణ పనుల్లో భారీ బండరాళ్ల పేలుళ్ల ధాటికి వ్యవసాయ బోరు బావులు కూరుకుపోతున్నాయి. దీంతో ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మాల్కాపూర్ సమీపంలో కాళేశ్వరం కాలువ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సొరంగం ద్వారా చేపడుతున్న కాలువ పనుల్లో అడ్డువచ్చిన బండరాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఫలితంగా కెనాల్‌కు పక్కనే ఉన్న వ్యవసాయ బోరుబావులు కూరుకుపోతున్నాయి. కెనాల్ చుట్టు పక్కల సుమారు 50 మంది రైతులు వందల ఎకరాల్లో వరి, జొన్న, కూరగాయల పంటలు సాగుచేస్తున్నారు. పేలుళ్ల ధాటికి బోరుబావుల్లో మోటార్లు ఇరుక్కుపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పంటలు నష్టపోవడంతో పాటు విద్యుత్ మోటర్లు, బోరుబావులు దెబ్బతింటున్నాయని కన్నీరుమున్నీరు అవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు నష్టపరిహారంతో పాటు పేలుళ్లు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్ణీత సమయంలోగా పరిష్కరించండి

- కలెక్టర్ రాజర్షిషా
- ప్రజావాణికి 42 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 42 అర్జీలు రాగా ఆయా శాఖలకు చెందిన అధికారులకు అందజేశారు. నిర్ణీత సమయంలోగా పరిష్కరించి ప్రజావాణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మండలస్థాయిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను అక్కడే పరిష్కరించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో తగిన పరిష్కారం చూపాలన్నారు. ఫలితంగా ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు వెంకట శైలేష్, భీమయ్య, శ్రీనివాస్‌రావు, జెంలా నాయక్, సుధాకర్, రజాక్, సాయిబాబా, నాగరాజు, కమలాకర్, జానకి రామ్ సాగర్, విజయలక్ష్మి, ఇందిరా, డాక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ పట్టించుకోవడం లేదు



మా ఇంటి పక్కవాళ్లు ఇంటి గోడ పునాదులను ఆనుకొని అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో మా ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయమై గత డిసెంబర్ నుంచి మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా.. కమిషనర్ పట్టించుకోవడం లేదు.
– సుమలత, మెదక్

న్యాయం చేయండి



మా తాతల ఆస్తిని అక్రమార్కులు నకిలీ పత్రాలతో ఆక్రమించుకున్నారు. ఈ విషయమై నిలదీస్తే చంపుతామని భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. మున్సిపల్ అధికారుల అండదండలతోనే అక్రమ పత్రాలు సృష్టించినట్టు తెలిసింది. ఈ విషయంలో మాకు న్యాయం చేయండి.
– రాంకిషన్, మెదక్

ఇల్లు ఇప్పించండి



నిరుపేదలమైన మాకు సొంత ఇల్లు లేదు. డబుల్ బెడ్రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇల్లు వచ్చేలా చూడండి.
– జహంగీర్, తూప్రాన్

క్లుప్తంగా

36 మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్‌: లిక్కర్ తాగి వెహికల్స్ నడిపిన 36 మందికి సంగారెడ్డి జిల్లా జడ్జి జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం...శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 36 మంది దొరికినట్లు తెలిపారు. సోమవారం నిందితులను సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 31 మందికి ఒక్కొక్కరికి రూ.రెండువేల చొప్పున, ఐదుగురికి రూ.మూడువేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

సిద్దిపేటలో....

సిద్దిపేటకమాన్‌: లిక్కర్ తాగి వెహికల్ నడిపిన వారికి సిద్దిపేట కోర్టు జైలు, జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ కథనం ప్రకారం... నాలుగు రోజుల క్రితం సిబ్బందితో కలిసి టౌన్ లోని ప్రధాన చౌరస్తాల్లో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లిక్కర్ తాగి వెహికల్స్ నడుపుతూ 15 మంది దొరికారన్నారు. సోమవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి అందరికి కలిపి రూ.34,500 జరిమానా వేశారని, వీరిలో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని సీఐ వివరించారు.

రోగిని కొట్టిన డాక్టర్‌కు మెమో

నారాయణఖేడ్‌: నారాయణఖేడ్ గవర్నమెంట్ రీజినల్ హాస్పిటల్ లో రెండు రోజుల క్రితం రోగిపై దాడి చేసిన డాక్టర్, సెక్యూరిటీ గార్డులకు సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి మెమోలు జారీచేశారు. వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని హట్యానాయక్ తండాకు చెందిన హనుమాన్ నాయక్ కాలినొప్పితో బాధపడుతూ రెండు రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లాడు. ఓపీ చీటీ తీసుకొని క్యూలో నిలబడ్డాడు. ఎంతకీ తనవంతు రాకపోవడంతో డాక్టర్ ఎస్.ఇస్రాయిల్‌ను నిలదీశాడు. దీంతో డాక్టర్ 'నన్నే ప్రశ్నిస్తావా?' అంటూ హనుమాన్ నాయక్ ను సెక్యూరిటీ గార్డులు వి.రాజు, బి.సత్యనారాయణతో కలిసి కొట్టారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సూపరింటెండెంట్ బాధ్యులైన ముగ్గురికి సోమవారం మెమోలు జారీచేశారు. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రేమ కోసం వచ్చి...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఏపీలోని ఒంగోలు చెందిన ఓ బాలిక తను ప్రేమించిన వాడి కోసం రామచంద్రాపురం వచ్చింది. కాగా ప్రేమించిన ఆ యువకుడు ఆమెను సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లిలో వదిలేసి వెళ్లాడు. దీంతో ఆ బాలిక రోడ్డు పై రోదిస్తూ ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆమెకు ధైర్యం చెప్పారు. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన యువకుడు ప్రస్తుతం పటాన్‌చెరులో సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడని అతని కోసం ఇక్కడికి వచ్చానని వివరించింది. అతడి ఫోన్ నంబరు కూడా తన వద్ద లేదని సీఐ సంజయ్‌కు చెప్పగా, స్టేట్ హోంకు తరలించారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి నిరసన

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన సురేష్ ముదిరాజ్ అనే యువకుడు గ్రామంలో గల చెరువు, కుంటల్లో చేపలు పట్టనిస్తలేరని ఆవేదనతో సోమవారం గ్రామంలో సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు, ఏఎస్ఐ రమణారెడ్డిలు ఘటన స్థలానికి చేరుకొని యువకుడికి నచ్చజెప్పారు. దీంతో యువకుడు కిందికి దిగి మాట్లాడుతూ.. కులవృత్తి పరంగా తమకు గ్రామంలో చెరువు, కుంటల్లో చేపలు పట్టనిస్తలేరని, గంగపుత్రులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు తమ కులానికి సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వాలని, చెరువు, కుంటలపై హక్కు కల్పించాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సంబంధిత అధికారులు, కుల సంఘాల వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

గుప్పుమంటున్న గంజాయి

బానిసవుతున్న యువత, కూలీలు





పట్టుకున్న గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీసీపీ శిల్పవల్లి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): గంజాయి గుప్పుమంటోంది. యువత, కూలీలు మత్తుకు బానిసలవుతున్నారు. పట్టణాలకు దగ్గరి గ్రామాల్లో జోరుగా నిర్మాణాలు సాగుతున్నాయి. పనులు చేసేందుకు వచ్చిన భవన నిర్మాణ కార్మికులు అలసట నుంచి ఉపశమనం కోసం మత్తుకు బానిసవుతున్నారు. వలసజీవుల బలహీనతను ఆసరా చేసుకుంటున్న కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సరఫరా చేస్తున్నారు. మత్తుకు బానిస చేస్తున్నారు.

జోరుగా దందా...

వలస కార్మికులు ఎక్కువగా నివసించే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాంతంలో మత్తుదందా జోరుగా సాగుతోంది. కార్మికులు, యువకులు చాలామంది గంజాయి పొడిని సిగరెట్లు, బీడీల్లో నింపి పీల్చుతున్నారు. మత్తులో జోగుతున్నారు. ఏడాది కాలంలో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు గంజాయి కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఫిబ్రవరిలో 5 కిలోలు, ఆగస్టులో 13 గ్రాముల కొకైన్ , మార్చిలో 22 కిలోల గంజాయి, తాజాగా కొల్లూర్‌లో 120 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సమాచారం ఇవ్వండి...



మాదకద్రవ్యాలు వాడి జీవితాలు నాశనం చేసుకోవద్దు. గంజాయి అమ్మేవారి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వండి. యువత మత్తుకు బానిస కావొద్దు.

–శిల్పవల్లి, డీసీపీ, మాదాపూర్

నిఘా ఏర్పాటు చేశాం



గంజాయి రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీలు చేస్తున్నాం. అనుమానం ఉన్నచోట్ల నిఘా ఏర్పాటు చేశాం.

– సంజయ్, ఇన్ స్పెక్టర్, రామచంద్రాపురం

గుండెపోటుతో ఉపాధిహామీ కూలీ మృతి

- పనిచేసే చోటే కుప్పకూలిన వైనం
- మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో ఘటన



చాకలి నాగరాజు మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పటివరకు తోటికూలీలతో పనులు చేస్తున్న ఓ ఉపాధిహామీ కూలీ గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఈ సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం దేవులపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. దేవులపల్లి గ్రామానికి చెందిన చాకలి నాగరాజు(36)తోపాటు అతని భార్య విజయ, కుటుంబసభ్యులు, ఇతర గ్రామస్తులు గ్రామసమీపంలోని ఈడిగోని కుంటలో ఉపాధిపనులకు వెళ్లారు. అక్కడ పూడికమట్టి తీసే పనుల్లో భాగంగా నాగారాజు గడ్డపారతో పూడిక తవ్వుతుండగా, ఇతర కూలీలు మట్టితీస్తున్నారు. కాసేపటికి అందరూ పనులు ముగించుకుని ఇంటికి రావాల్సి ఉండగా, ఇంతలో అతడు ఛాతీలో నొప్పివస్తోందని చెబుతూ కూర్చుండిపోయాడు. అక్కడే ఉన్న కుటుంబసభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్ ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక ఆర్ఎంపీ వచ్చి పరీక్షించి ఆస్పత్రికి తరలించాలని చెప్పారు. నాగరాజును ఆటోలో కౌడిపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ సీపీఆర్ నిర్వహించారు. ఫలితం లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు సీపీఆర్ నిర్వహించినా ఎలాంటి చలనం లేకపోవడంతో మృతి చెందినట్లు చెప్పారు. నాగరాజు గ్రామంలో కూలీపనులతోపాటు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరుతో మోసం

సిద్దిపేటకమాన్‌: పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్నాడు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి కథనం ప్రకారం..పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు పార్ట్‌టైం ఉద్యోగం అంటూ మెసేజ్ వచ్చింది. లింకు ఓపెన్ చేసి ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. ఆయన మరొక లింకు పంపి వివరాలు నమోదు చేయాలని సూచించాడు. ఓటీపీ ఇతర వివరాలు చెప్పడంతో ఖాతా నుంచి రూ.2,16,246 డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు జాతీయ ఫిర్యాదుల విభాగానికి ఫోన్ చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బాత్‌రూమ్‌లో జారిపడి వృద్ధుడు మృతి

పటాన్‌చెరు టౌన్: బాత్‌రూమ్‌లో జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం... శ్రీవాణినగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ జీవామృతరావు(67) ఆదివారం రాత్రి బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాలేదు. అయితే కుటుంబ సభ్యులు బాత్ రూమ్ తలుపులు బద్దలగొట్టి లోనికి వెళ్లి చూడగా పడి ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు మదీనగూడలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి కుమారుడు ప్రేమ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటరూరల్‌: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర బాధ్యుడు మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రతీ నెల ఒకటో తేదీన పెన్షన్లు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా మూడు డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అనంతరం అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కు వినతి పత్రం అందజేశారు. నిరసనలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి, లీడర్లు ఆర్.రాజిరెడ్డి, మహంకాళి, రాములు, భూంరెడ్డి, గాల్ రెడ్డి, బాలేశం, రవీందర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, రాజ గోపాలరావు, జలీల్, లక్ష్మయ్య, బలరాం, శ్రీధర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో మాచాపూర్ వాసి మృతి



మల్లేశం మృతదేహం

చిన్నకోడూరు(సిద్దిపేట): రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టేకు మల్లేశం (45) మృతి చెందాడు. చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన మల్లేశం స్థానికంగా మటన్ షాప్ నిర్వహిస్తాడు.ఈయన సోమవారం బైక్‌పై రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలోని సోదరి ఇంటికి వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా సిరిసిల్ల వద్ద టాటా ఏస్ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో సోమవారం సాయంత్రం వివాహిత బల్ల లత (32) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబంలో సమస్యల కారణంగానే లత ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఇద్దరి రిమాండ్...

పటాన్‌చెరు టౌన్: బాలిక ఆత్మహత్య కేసులో ఇద్దరని రిమాండ్‌కు తరలించిన సంఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు పట్టణం అంబేడ్కర్ కాలనీకి చెందిన బాలిక శనివారం ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఏపీలోని అనంతపురం జిల్లా కొమ్మూరు గ్రామానికి చెందిన ఆదిశేషు, హరీష్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని సోమవారం రాత్రి రిమాండ్ తరలించారు.

బాలిక కిడ్నాప్ కేసులో..

పటాన్‌చెరు టౌన్: బాలిక కిడ్నాప్ కేసులో ఒకరిని రిమాండ్ తరలించిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలో ఓ కాలనీకి చెందిన బాలిక 10 రోజుల క్రితం కనిపించకుండా పోగా, కుటుంబ సభ్యులు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు దర్యాప్తులో భాగంగా బాలికను తీసుకెళ్లిన మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్ రాథోడ్‌ని అదుపులోకి తీసుకొని సోమవారం రాత్రి కిడ్నాప్ కేసుతో పాటు వివిధ కేసుల కింద రిమాండ్ కు తరలించారు.

ఇద్దరు యువకుల అదృశ్యం

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు యువకులు అదృశ్యమయ్యారు.



రంజాన్‌ఆలీ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్ చెరు): ఓ యువకుడు అదృశ్యమయ్యా డు. రామచంద్రాపురం పోలీసులు కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రంజాన్ ఆలీ జీవనోపాధి నిమిత్తం కొల్లూరుకు వలసవచ్చాడు. తన సోదరుడితో స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా ఈనెల7వ తేదీన ఉదయం 8గంటలకు కూరగాయల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కోసం చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేద. దీంతో ఆయన సోదరుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కే దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



రమేశ్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన వేల్పుల రమేశ్(27) అదృశ్యమైనట్లు ఎస్సై నారాయణ తెలిపారు. ఈనెల 4వ తేదీన రమేశ్ భార్యతో గొడవపడి మేనత్త ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత 6న మద్దూరులోని ఓ సెల్ ఫోన్ షాపులో ఫోన్ రిపేర్ చేయించుకొని తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో రమేశ్ తండ్రి సిద్ధులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి..ఎనిమిది మందికి గాయాలు

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి.

ఒకరి మృతి



కృష్ణ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు.పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళంకు చెందిన కృష్ణ (39) బొల్లారంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సోమవారం డ్యూటీ ముగించుకొని కాలినడకన ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డుపై పడిఉన్న ఆయనను స్థానికులు హాస్పిటల్ కు తరలించారు. అయితే అప్పటికే కృష్ణ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేందర్ రెడ్డి వివరించారు.

స్కూటీని ఢీకొట్టిన కారు.. ముగ్గురు విద్యార్థులకు గాయాలు



గాయపడ్డ విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): స్కూటీని కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సోమవారం బొల్లారం గ్రామానికి చెందిన అర్జున్ (7), ప్రేమ్ (14), ప్రవీణ్ (12) కరాటే క్లాసుల కోసమని స్కూటీపై జిన్నారం బయలుదేరారు. సర్వీస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి టూవీలర్ ను ఢీకొట్టింది. దీంతో అర్జున్, ప్రేమ్, ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగి గంట దాటినా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోలేదు. విషయం తెలుసుకున్న బీజేపీ లీడర్ ఆనంద్ కృష్ణారెడ్డి గాయపడ్డవారిని తన కారులో దగ్గర్లోని ఓ ప్రైవేటు హాస్పిటల్ కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేందర్ రెడ్డి తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు.. నలుగురికి గాయాలు

చేగుంట(తూప్రాన్): కారు చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి.యాదగిరిగుట్ట నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారు సోమవారం చేగుంట మండలం బోనాల్ గ్రామ శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నిజామాబాద్ కు చెందిన విజయ్(22), అజయ్(20), అభిషేక్(22), రాజ(21)కు గాయాలయ్యాయి. గాయపడ్డవారిని స్థానికులు 108లో రామాయంపేట గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ

పటాన్‌చెరు టౌన్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన రజినీకాంత్ ఈ నెల 7వ తేదీన తన బైక్ పై బీడీఎల్ టౌన్ షిప్‌నకు కూరగాయలు తీసుకురావడానిక వెళ్లగా, శంకర్‌పల్లి నుంచి భానూర్ వైపు బైక్ పై వినయ్ వస్తున్నాడు. భానూర్ సమీపంలోకి రాగానే రెండు బైక్ లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రజినీకాంత్ కు తీవ్రగాయాలు అయ్యాయి. పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్నట్టు రజినీకాంత్ కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని రైతు మృతి



చంద్రు నాయక్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతిచెందాడు. ఎస్సై మధుసూదన్ గౌడ్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చెర్లపల్లి పంచాయతీ పరిధిలోని వరదవాని చెరువు తండాకు చెందిన రైతు చంద్రు నాయక్ (55) టూవీలర్ పై భార్య బూలి, కూతురు మంజుతో కలిసి కూరగాయలు అమ్మేందుకు వెల్దుర్తికి వెళ్లాడు. తిరిగి చెరువు తండాకు వస్తుండగా వెల్దుర్తి శివారులో ఎదురుగా వస్తున్న బైక్ బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో భార్యాభర్తలు, కూతురుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికంగా ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు, అక్కడి నుంచి తూప్రాన్ ఏరియా హాస్పిటల్ కు తరలించారు. అయితే అప్పటికే చంద్రునాయక్ చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్ చేసి రైతు మృతికి కారణమైన రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉద్యోగం పోయిందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగం పోయిందని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం..సాయి విల్లాస్‌లో నివాసం ఉండే హరీశ్(30) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేశాడు. అయితే ఇటీవలే హరీశ్ ఉద్యోగం పోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం భార్య నందిని బయటకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న హరీశ్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య తిరిగి ఇంటికి రాగానే ఇంట్లో చీరతో ఉరివేసుకొని భర్త కనిపించాడు. స్థానికుల సాయంతో భర్తను మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడు హరీశ్ సోదరుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


డ్యూటీకి వచ్చి...

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వచ్చిన ఓ కార్మికుడు ఛాతీ నొప్పి అంటూ కుప్పకూలిన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ గౌడ్ కథనం ప్రకారం పుల్కల్ మండలం మదిమాణిక్యం గ్రామానికి చెందిన గాజుల సుధాకర్(53) పాశమైలారంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వచ్చిన సుధాకర్ ఛాతీనొప్పి వస్తుందని తోటి కార్మికులకు చెప్పగా, మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో వాడుకలో లేని ట్యాంక్‌లో ఓ వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం వచ్చింది. వారు వెళ్లి చూడగా, మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. వెంచర్ సూపర్‌వైజర్ శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బల్దియాకు నష్టం రూ.270 కోట్లు



కబేళాల నిర్వహణ సంస్థ నిర్వాకం

- లీజు, రాయల్టీ చెల్లించకుండా ఎత్తులు
- సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీకి చెందిన ఆధునిక కబేళాల నిర్వహణ కాంట్రాక్టు దక్కించుకున్న ప్రైవేట్ కంపెనీల కన్సార్టియం లీజు, రాయల్టీ చెల్లించకుండా ఎత్తులు వేసింది. అధికారులకు మరమ్మతుల పేరు చెప్పి చెల్లించాల్సినవి చెల్లించకుండా, కబేళాల్లో జంతువుల వధ కొనసాగించి బల్దియాకు రూ.270 కోట్లు నష్టం వాటిల్లేలా వ్యవహరించింది. అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు జారీ చేసినట్లు ఫోర్జరీ చేసింది. ఈ విషయం ఆలస్యంగా గుర్తించిన జీహెచ్ఎంసీ హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

2012లో టెండర్లు..

- అంబర్‌పేట, న్యూ బోయిగూడల్లో ఉన్న అత్యాధునిక కబేళాలను ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (ఓ అండ్ ఎం) విధానంలో నిర్వహణకు 2012లో జీహెచ్ఎంసీ టెండర్లు పిలిచింది. వీటిలో పాల్గొన్న ఫ్రెష్ ఎన్ ఫ్రోజన్ ఫుడ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏడాదికి రూ.19.18 కోట్ల చొప్పున చెల్లించేలా మూడేళ్ల కాలానికి ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. ఆ సంస్థ ప్రతినిధులు 2013 అక్టోబరు 16న జీహెచ్ఎంసీతో రెండు కబేళాలకు సంబంధించిన వేర్వేరు అగ్రిమెంట్లు చేసుకున్నారు. అందులోని నిబంధనల ప్రకారం నాటి నుంచి 30 రోజుల్లో కబేళాల్లో పనులు ప్రారంభించాలి.
- అయితే ఆది నుంచీ పథకం ప్రకారం వ్యవహరిస్తున్న ఈ సంస్థ కబేళాల్లో నిర్మాణ పనులు పూర్తి కాలేదని, మరికొన్ని మరమ్మతులు చేయాల్సి ఉందని జీహెచ్ఎంసీతో చెప్తూ వచ్చారు. దీంతో వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు సంస్థ కోరిన పనులు పూర్తి చేసి 2014 అక్టోబర్‌లో వారికి అప్పగించారు. అప్పటి నుంచి ఆ సంస్థ రెండు కబేళాల్లో పనులు ప్రారంభించింది. తొలినాళ్లలో ట్రయల్ రన్ నిర్వహించిన నిర్వాహకులు అప్పటికీ కబేళాల్లో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయంటూ జీహెచ్ఎంసీకి నివేదించారు. దీంతో బల్దియా అధికారులు రాంకీ ఎన్విరో ఇంజినీర్ లిమిటెడ్‌కు కాంట్రాక్టు ఇచ్చి మరీ ఆయా పనులు పూర్తి చేయించారు.

సాకు చూపి.. చెల్లింపులు ఆపి..

- 2015 జనవరి నుంచి ఈ రెండు కబేళాలూ వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి. తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్న సదరు సంస్థ జీహెచ్ఎంసీకి మాత్రం కబేళాల్లో అనేక సమస్యలు వస్తున్నాయని, వాటి వల్ల పనులు జరగట్లేదని, తక్షణం స్పందించి సరి చేయాలంటూ లేఖలు రాస్తూ పోయింది. ఈ సాకుతో జీహెచ్ఎంసీ అధికారులకు ఎలాంటి చెల్లింపులు చేయట్లేదు. అనుమానం వచ్చి పరిశీలించిన బల్దియా అనేక కీలక విషయాలు గుర్తించింది. 2015 మే నుంచే అంబర్‌పేట కబేళా ద్వారా విదేశాలకు పశుమాంసం ఎగుమతి జరుగుతున్నట్లు తెలుసుకుంది. ఈ ఎక్స్‌పోర్ట్స్ జరగాలంటే జీహెచ్ఎంసీ వెటర్నరీ జాయింట్ డైరెక్టర్, బయోలాజిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అవసరమైన లేఖలను అప్పట్లోనే తీసుకుంది.
- అప్పటి నుంచి 2019 ఫిబ్రవరి వరకు మొత్తం 56,765.511 మెట్రిక్ టన్నుల పశుమాంసాన్ని అంబర్‌పేట కబేళా నుంచి విదేశాలకు ఎగుమతి చేశారు. పశువులు వధించడానికి ముందు, ఆ తర్వాత జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం నుంచి తీసుకోవాల్సిన ధ్రువీకరణ పత్రాలను వాళ్లే తయారు చేసి, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేశారు. ఈ ఎక్స్‌పోర్ట్స్ మాత్రమే కాకుండా అంబర్‌పేట కబేళాలో 3,56,468 గొర్రెలు, 2,20,071 మేకలు, న్యూ బోయిగూడ కబేళాలో 2,61,965 గొర్రెలు/మేకలు, 72,868 పశువులను స్థానికంగా మాంసం విక్రయాల కోసం వధించారు.
- మొత్తమ్మీద 2015–2020 (నవంబర్) మధ్య పెద్ద ఎత్తున వ్యాపారం చేసిన సదరు సంస్థ భారీ మొత్తం తన ఖాతాల్లో వేసుకుంది. కాంట్రాక్టు అగ్రిమెంట్‌లోని నిబంధనలు బేఖాతరు చేస్తూ వచ్చింది. మొత్తమ్మీద లీజులు, రాయల్టీల రూపంలో జీహెచ్ఎంసీకి రావాల్సిన రూ.270.06 కోట్లకు గండి కొట్టింది. అంతర్గత విచారణలో ఈ విషయం గుర్తించిన జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ చక్రపాణి రెడ్డి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఐపీసీలోని 420 (మోసం), 468 (ఫోర్జరీ), 471 (నకిలీ పత్రాలు అసలైనవిగా చూపటం) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.